క్లుప్తంగా

ఎంసీసీ వీడియోగ్రాఫర్ పనితీరుపై ఆగ్రహం

పెద్దాపురం: భారత ఎన్నికల సంఘం నియమ, నిబంధలను పాటించాలని మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసీసీ)పై ఎన్నిసార్లు ఆర్‌ఓ సమావేశాలు నిర్వహించినా అవి ఆచరణలో నీరు గారుతన్నాయనే చెప్పుకోవాలి. శనివారం తిరుపతిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు ఎన్నికల ప్రచారంలో ఉండగా ఎంసీసీ వీడియో గ్రాఫర్ ఓవరాక్షన్ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంసీసీ సిబ్బంది అక్కడ జరిగిన సన్నివేశాలు వీడియో తీసి ఏవైనా సంఘటనలు జరిగితే ఆర్‌ఓ దృష్టి తీసుకువెళ్లాలి. కానీ ఇక్కడ ఎన్నికల ప్రచారంలో ఉన్న దవులూరి దొరబాబు ఇంటర్వ్యూ కావాలంటూ పదే పదే ఇబ్బంది పెట్టారు. దీంతో ఆయన మీడియా ప్రతినిధి అనుకుని ప్రచారం చివరిలో వాయిస్ ఇస్తానని చెప్పినప్పటికీ టైం లేదంటూ మళ్లీ టీడీపీ రాజప్ప ప్రచారం కవర్ చేయాలంటూ అక్కడ కార్యకర్తల వద్ద హల్‌చల్ చేశాడు. దీనిపై అక్కడే ఉన్న ఎంసీసీ అధికారి మహేష్‌ను అడగగా ఎంసీసీ అభ్యర్థుల ఇంటర్వ్యూలు తీసుకోకూడదని, ప్రచారంలో ఏం జరిగితే అది వీడియో తీసి ఆర్‌ఓకు పంపాలన్నారు. కానీ కొంత మంది సోషల్ మీడియా ప్రతినిధులని, గతంలో మీడియాలో పని చేసి మానేసిన వారిని ఎంసీసీ వీడియో గ్రాఫర్‌లుగా ఉంచడం వల్ల పార్టీల మధ్య చిచ్చు, ఎంసీసీ అమలు తీరు అధ్వానం అయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆర్‌ఓ జేఎస్ రామారావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై పూర్తి విచారణ జరిపి అసలు అటువంటి వారిని వీడియో గ్రాఫర్‌లుగా ఉంచమని వివరణ ఇచ్చారు.

ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన కమిషనర్



సామర్లకోట ఫిల్టరు బెడ్ చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా శనివారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలించారు. ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న నాగార్జున చెరువులో నీటిని ఫిల్టరు చేసి ప్రజలకు తాగు నీరు సరఫరా చేయడానికి ఫిల్టర్ ప్లాంటును నిర్మించారు. ఈ మేరకు తాగునీరు ఫిల్టరవుతున్న విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల 15వ తేదీన గోదావరి కాలువ మూసి వేసే అవకాశం ఉన్న కారణంగా ఫిల్టర్ చెరువు(నాగార్జున చెరువు)ను పరిశీలించారు. చెరువు ఆకుపచ్చ రంగులో ఉండడంతో ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చెరువులో నీటిని ఫిల్టర్ ప్లాంటుకు తరలించకపోవడంతో చెరువు నాచుతో నిండిపోయిందని, దీనిపై ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తానని కమిషనర్ తెలిపారు. తాగునీటి చెరువు కలుషితం అయ్యే అవకాశం ఉన్న కారణంగా చేపల వేటకు అనుమతి ఉండదని కమిషనర్ చెప్పారు.

ఉచిత సీట్లకు 31 వరకూ దరఖాస్తులు

సామర్లకోట: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం ఈనెల 31వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇవ్వాలని, దీనిలో భాగంగా ఒకటో తరగతిలో చేరడానికి ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీతో దరఖాస్తు గడువు సమయంలో ముగుస్తుందని, కానీ దానిని 31 వరకు పొడిగించినట్టు చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ, తదితరులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రైల్వే డీఎస్పీ ఎల్.మోహన్‌రావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలను పురస్కరించుకొని నగదు, మద్యం వంటి మత్తు పదార్థాలు భారీ మొత్తంలో రవాణా జరిగే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని తనిఖీ చేయాలని సూచించారు. సామర్లకోట రైల్వే జంక్షన్ కావడంతో మరింత జాగ్రత్తగా సిబ్బంది వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ఇన్‌స్పెక్టర్లు గౌస్ బేగ్ (కాకినాడ) డి.సయ్యద్ (రాజమహేంద్రవరం)ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ, జీఆర్పీ ఎస్సైలు బి.లోవరాజు(సామర్లకోట) అబ్దుల్ మరూఫ్ (తుని) ఎన్.రవికుమార్ (కాకినాడ)లు ఆయా స్టేషన్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. అద్భుత ఫలితం

- సేంద్రియ సాగుతో ఆరోగ్యకర పంటలు
- తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం
- మంచి దిగుబడులు సాధిస్తున్న రైతులు
- 598 ఎకరాలకు విస్తరించిన సాగు

రైతులు ప్రకృతి సేద్యంపై మొగ్గు చూపుతున్నారు. సులభ పద్ధతిలో ఎరువులను తయారు చేసుకుని, ఖర్చులు తగ్గించుకుంటున్నారు. అధిక దిగుబడితో పాటు మంచి లాభాలను ఆర్జిస్తున్నారు. రసాయన ఎరువులు పెరగడం, వాటి వల్ల లాభాలు లేకపోవడంతో సేంద్రియ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.



గోరింట గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న వరి పంట (ఫైల్)

పెద్దాపురం: మనం తీసుకున్న ఆహార అలవాట్లే మన ఆరోగ్యాన్ని, ఆయుష్‌ను నిర్ణయిస్తుంది. తినే ఆహార పదార్థాలు రసాయనాలు, పురుగుల మందులతో నిండిపోతే అది మన శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. విచ్చలవిడి రసాయనాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలు అంతా ఇంతా కాదు. పైగా పురుగు మందుల భారమే అన్నదాతను నిలువునా ముంచుతుంది. అందుకే ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టి తక్కువ పెట్టుబడితో పెద్దాపురం మండల రైతాంగం ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధిస్తున్నారు.

పెరిగిన సేంద్రియ సాగు విస్తీర్ణం

మండలంలో గత ఏడాది రెండు, మూడు గ్రామాల్లోనే సేంద్రియ సాగు చేపట్టారు. తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు రావడంతో రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామాల్లో 598 ఎకరాల మేర సాగు విస్తరించింది. సుమారు 1200 మంది రైతులు వరి సాగు చేపట్టారు. ఈ సాగులో ఎరువులు రైతులే తయారు చేసుకోవడంతో పెట్టుబడి తగ్గి, లాభసాటి సాగు పొందుతున్నారు.

బ్రహ్మాస్త్రం తయారీ

వేప, సీతాఫలం, గానుగ, ఉమ్మెత్త, ఆముదం ఆకులను 20 లీటర్ల ఆవు మూత్రంలో ఉడికించి చేసే కషాయాన్ని 'బ్రహ్మాస్త్రం' అని పిలుస్తారు. ఈ కషాయాన్ని పైరుపై పిచికారీ చేయాలి. తద్వారా పంటను ఆశించే పెద్ద పురుగులు నశించిపోతాయి.

నీమాస్త్రం

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల ఆవుపేడ, 10 కిలోల వేపాకులు కలిపి రెండు రోజులు (48 గంటలు) నానబెట్టాలి. ఇలా వచ్చిన (నీమాత్రం) మిశ్రమాన్ని మూడో రోజు వడబోసి పంటలపై పిచికారీ చేయాలి. ఫలితంగా పంటలను ఆశించిన తెగుళ్ల (రసం పీల్చే పురుగులు)ను సమూలంగా నిర్మూలించవచ్చు. ఈ మూడింటి (ఆవు మూత్రం, ఆవుపేడ, వేపాకులు)ని పది రోజులకోసారి పిచికారీ చేస్తే పైరు ఏపుగా పెరగడంతో పాటు మంచి దిగుబడి సాధించవచ్చు.

జీవామృతం తయారీ ఇలా

200 లీటర్ల నీటిలో 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల ఆవుపేడ, రెండు కిలోల బెల్లం, రెండు కిలోల పప్పు దినుసుల పిండి, పిడికెడు పుట్టమట్టి కలిపి



జీవామృతం సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న రైతులు

రెండు రోజుల (48 గంటలు) పాటు నానబెట్టి, దాన్ని వడపోయాలి. ఇలా వచ్చిన జీవామృతాన్ని నీటి ద్వారా పైరుకు పారనివ్వాలి. తద్వారా భూసారం పెరుగుతుంది. ప్రకృతి సేద్యం ద్వారా కేవలం రూ.500 నుంచి రూ.700 లోపు పెట్టుబడితో ఎకరా వరి పొలంలో 25 నుంచి 30 బస్తాల దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు.

అజొల్లా మదర్ బెడ్

నీరు నిల్వ ఉండేలా చతురస్రాకారంలో గుంత తవ్వి పేడ, బెల్లం నీటితో కలిపి వారం రోజుల పాటు నిల్వ ఉంచాలి. దీంతో 'అజొల్లా' ఎరువు తయారవుతుంది. దీన్ని యూరియాకు ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. ఇది ప్రధానంగా కలుపు నివారణకు ఉపయోగపడుతుంది. ఎకరాకు 8 కేజీల అజొల్లాను వేయాలి. అలాగే చేపల పెంపకం, పాల శాతం పెంచేందుకు రోజుకు పది గ్రామాల వంతున పశువులకు మేతగా వేయవచ్చు.

ఖర్చు ఆదా



సేంద్రియ సాగు వల్ల ఖర్చులు చాలా వరకు తగ్గాయి. రూ.10 వేలు పెట్టుబడితో రసాయన ఎరువులు వినియోగించి పంట సాగు చేసే పొలాన్ని ప్రకృతి సేద్యం ద్వారా రూ.1,000తో పండించవచ్చు. పైగా ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను వాడడంతో ఆరోగ్యం కూడా బావుంటుంది.
– కోన రామకోటేశ్వరరావు,
సేంద్రియ సాగు రైతు, గోరింట

పెట్టుబడి తక్కువ.. పంట నాణ్యత ఎక్కువ



ప్రతి మొక్క పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం. రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అందుతాయి. నాణ్యమైన పంట అందుతుంది. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అందుకే రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి. – సంజయ్‌కుమార్,
మండల వ్యవసాయశాఖాధికారి,
పెద్దాపురం

బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



బాల్య వివాహాల చట్టంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉష

పెద్దాపురం: బాల్య వివాహాల నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని పెద్దాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఉష అన్నారు. పట్టణంలోని సాగర్ మున్సిపల్ పాఠశాలలో బాల్య వివాహ చట్టాలపై బేటీ బచావో బేటీ పడావో పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉష మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం బాల్య వివాహ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రసాద్, రామలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు దేవి, ఉమా ఇంద్ర, జయ, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 122 మంది గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం ఫిజికల్ సైన్స్ పరీక్షకు 122 మంది గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాల్లోను 1617 మంది విద్యార్థులు, 384 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 122 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. స్థానిక బాలికోన్నత హైస్కూల్ సెంటర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ తరుపున కె.శ్రీధర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి స్నట్లు ఎంఈఓ తెలిపారు.

అభివృద్ధికి అండగా నిలవండి



తిరుపతిలో వృద్ధురాలిని ఓటెయ్యాలని అభ్యర్థిస్తున్న దొరబాబు

- తిరుపతి ఎన్నికల ప్రచారంలో పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి

పెద్దాపురం: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తెరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఓటెయ్యాలని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు కోరారు. విజయ సంకల్పయాత్ర పేరిట ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం తిరుపతిలో రెండో రోజు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కుంచే అమరావతి, కరెడ్ల వీరాస్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానుద్దేశించి దొరబాబు మాట్లాడుతూ మీలో ఒక్కడిని.. స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన నాకు జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారు ప్రతీ ఒక్కరూ నన్ను ఆదరించి ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని దొరబాబు కోరారు. తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి సాక్షిగా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయం సాధించడం తథ్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మండల కన్వీనర్ గోపు మురళి, నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, కుంచే వెంకన్న, జగ్గారావు, కామన రామకృష్ణ, వాసిరెడ్డి శ్రీనివాస్, పెంటా విజయ్‌కుమార్, మేడిశెట్టి భద్రం, సుందరెడ్డి రాజు, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల నానాజీ, శేరు వెంకబాబు, యడవల్లి కొండలరావు, జట్లా మోహన్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

- కాకినాడ ఎంపీ, పిఠాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత
- పిఠాపురంలో ఎన్నికల ప్రచారం



పిఠాపురంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వంగా గీత



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత కోరారు. పిఠాపురం మున్సిపాలిటీలోని 3, 4 వార్డుల్లో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మ ఆధ్వర్యంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రతి ఇంటి వద్ద స్థానికులు ఆమెకు హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా, పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకుని వారితో మమేకమయ్యారు. మాకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకునే అవకాశం మీ దగ్గర మాత్రమే ఉంటుందని, అందుకే మాకు మీరే ఎమ్మెల్యే కావాలి.. సీఎం వైఎస్ జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ స్థానికులు ముక్త కంఠంతో చెప్పారు. ఆయా వార్డుల్లో ప్రతిఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటివరకూ తాను పిఠాపురానికి చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, అధికార ప్రతినిధి మల్లేశ్వరి, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు కొత్తపల్లి బుజ్జి, గండేపల్లి బాబీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ బాలిపల్లి రాంబాబు, బొజ్జా రామయ్య, కౌన్సిలర్ మతం లోవరాజు, మైనార్టీ నాయకుడు మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణమూర్తి
- గొల్లప్రోలులో బీఎల్‌ఓలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ కృష్ణమూర్తి

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల సిబ్బంది నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఈఆర్‌ఓ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ కృష్ణమూర్తి హెచ్చరించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శనివారం గొల్లప్రోలు మండల బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరి బాధ్యతలు వారు తూ.చా తప్పకుండా నిర్వర్తించాలన్నారు. ఎక్కడా తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి విషయంలోనూ ఆచితూచి అడుగేయాలన్నారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్ భాస్కర్, గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ టి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్

సామర్లకోట: ప్రస్తుత వేసవిలో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) జె.నరసింహనాయక్ అన్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్లను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వాటర్ ట్యాంకుల వద్ద ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు.సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజాప్రతినిధులు అనేక అంశాలను ఆరోగ్య సిబ్బంది దృష్టికి తీసుకుని వచ్చే అవకాశం ఉండదని, అందు వలన ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తి స్థాయిలో మందులు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దకు ఎండలో వచ్చిన వారికి ఇచ్చేందుకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వ్యాక్సిన్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో డాక్టర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య, మందుల స్టాక్ రికార్డులను ఆయన పరిశీలించారు. అత్యవసర కేసులను వెంటనే కాకినాడ ఆస్పత్రికి తరలించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, ముందుగానే రోగి సమాచారాన్ని కాకినాడ జీజీహెచ్‌కు ఫోన్‌లో తెలియజేయాలని సూచించారు. వైద్యులు బి.సురేఖ, కె.ప్రభ, సీహెచ్ భవ్యశ్రీ పాల్గొన్నారు.

నవ సమాజ చైతన్యానికి యువత కృషి చేయాలి



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న క్రాంతి తదితరులు



సామర్లకోటలో నిర్వహిస్తున్న కాగడాల ర్యాలీ



రక్తదానం చేసిన సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: నవ సమాజ నిర్మాణ చైతన్యానికి యువత కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సువ్వలగుంట వీధి భగత్‌సింగ్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ కన్వీనర్ కూనిరెడ్డి రవి అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడిన విప్లవ కిశోరాలు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌దేవ్, సుఖదేవ్‌లన్నారు. నేటి యువత సామాజిక సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, నేటి యువత భగత్‌సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు గోపాలకృష్ణ, అరుణ్‌కుమార్ మాట్లాడుతూ భగత్‌సింగ్ కలలుగన్న కలలు నెరవేర్చడానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి కళాకారులు దారపురెడ్డి సత్యన్నారాయణ, మహాపాతిన రాంబాబు, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పులిమేరులో

పులిమేరులో రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశెట్టి సురేష్, వి.సుధాకర్, కడితి సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

సామర్లకోట: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం రాత్రి పట్టణ సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో భారీ కాగడాల ర్యాలీ ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాసు, విప్పర్తి కొండలరావు, కరణం గోవిందరజాఉ, బాలం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

సామర్లకోట: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా గుర్తింపు పొందుతారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల వర్ధంతి సందర్భంగా స్థానిక భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మేరకు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రులలోను, బ్లడ్ బ్యాంకులలోను క్షతగాత్రులకు, ఆపరేషన్లు చేయించుకునే వారికి అందుబాటులో రక్తం లేకపోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారిని ఆదుకోవడానికి రక్తదానం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. రోటరీ బ్లడ్ బ్యాంకు డాక్టరు కామరాజు మాట్లాడుతూ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా గత ఏడాది 56 మంది రక్తదానం చేశారని చెప్పారు. ఈ శిబిరంలో 48 మంది రక్తదానం చేసినట్లు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్ర అధ్యక్షుడు బాలం హరి, కార్యదర్శి చల్లా మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బాలం శ్రీనివాసు, కరణం ప్రసాద రావు, కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, కె వరలక్ష్మి, నాగమణి, ఎస్తేర్ రాణి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకపోతే చర్యలు



సామర్లకోటలో పెట్రోలు బంకు నిర్వాహకులను కలిసిన కమిషనర్

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని పన్నుల బకాయిలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొండి బకాయిదారులను ఆయన శనివారం కలిసి ఈనెల 25వ తేదీ లోపు బకాయిలు చెల్లించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బకాయిపై ఉన్న వడ్డీ రద్దు చేసుకోవడానికి ఏక మొత్తంగా పన్నులు చెల్లించాలన్నారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లోని పెట్రోలు బంకు నుంచి రూ.ఏడు లక్షలు, ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏడీబీ రోడ్డులో ఉన్న పెట్రోలు బంకు నుంచి రూ.ఐదు లక్షల బకాయి ఉందన్నారు. ఈ రెండు బంకులకు యజమాని ఒక్కరే కావడంతో వెంటనే చెల్లించకపోతే బంకులు సీజ్ చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.50 లక్షల వరకూ బకాయిలున్నాయని, అధికారులు వీటిపై శ్రద్ధ చూపాలని తెలిపారు. రైల్వే నుంచి తాగునీటి పన్ను బకాయిల ఉందని, రైల్వే అధికారులకు నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ సిబ్బంది ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ప్రసాదరావు, రెవెన్యూ సురేంద్రకుమార్, జానికి బాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎంఎంవీవై వేగంగా పూర్తి చేయాలి

సామర్లకోట: ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన (పీఎంఎంవీవై) పథకం వేగంగా పూర్తి చేయాల ని డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్ ఆదేశించారు. శనివారం సాయంత్రం వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో పీఎంఎంవీవైలో కేసులు పెండింగ్‌లో ఉండడంతో కారణం అడిగి తెలుసుకున్నారు. మాతా, శిశు మరణాల నివారణపై దృష్టి సారించాలన్నారు. గర్భిణుల డెలివరీ ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగేలా చూడాలన్నారు. డీపీఎంఓ డాక్టరు సురేఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టరు శ్రీహిమవతి, సిబ్బంది పాల్గొన్నారు.